www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -176 శనివారం 27 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

## తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ

**బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిటీ సిఫార్సు**

**42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెంబర్ 9 విడుదల**

**సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలి: హైకోర్టు**






హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ శుక్రవారం సాయంత్రం జీవోను విడుదల చేసిం డెడికేటెడ్ కమిటీ సిఫార్సుల మేరకు బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెంబర్ 9ని విడుదల చేసింది.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించింది. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు విధించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల కోసం జీవో జారీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

# భారత ఫార్మాకు ట్రంప్ షాక్..

## మందులపై 100 శాతం సుంకాలు!



2లో.

- ఔషధాల దిగుమతిపై 100 శాతం సుంకం విధించనున్నట్లు ట్రంప్ ప్రకటన
- అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనలు
- అమెరికాలో ప్లాంట్లు నిర్మించే కంపెనీలకు సుంకాల నుంచి మినహాయింపు
- ట్రంప్ నిర్ణయంతో భారత ఫార్మా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం
- భారత ఫార్మా కంపెనీల ఆదాయంలో సింహభాగం అమెరికా మార్కెట్ నుంచే

# రాష్ట్ర కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

## అక్టోబర్ 1న బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్(డీజీపీ)గా రాష్ట్ర నిఘా విభాగం డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా ఆయనకు పోలీస్‌కోఆర్డినేషన్, డీజీపీ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు మిగతా 2లో.

# పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు

## లోతట్టు ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తం

**రోడ్లన్నీ జలమయం..వాహనదారులకు అవస్థలు**

**ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల**

**భద్రాద్రిలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

హైదరాబాద్**సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో గురువారం అర్థరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కాలనీలను వరద నీళ్లు ముంచెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాంగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లా సింగూరు నుంచి నీటిని భారీ స్థాయిలో కిందకు వదలడంతో మిగతా 2లో.



# ఎల్ అండ్ టీపై పగ

## సీఎం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం

**ఆ సంస్థకు కేటాయించిన భూములపై కన్నేసిన ముఖ్యమంత్రి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
సీఎం రేవంత్ రెడ్డి కక్షకట్టి మెట్రో నుంచి ఎల్ అండ్ టీని బయటికి పంపించడంతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బీఆర్ఎస్ ను అప్రతిష్టపాలు చేసేందుకు ఎల్ అండ్ టీ సహకరించకపోవడంతో ఆ సంస్థపై ముఖ్యమంత్రి పగబట్టారని ఆయన ఆరోపించారు. ఆ సంస్థకు ఒఆర్ఆర్ చుట్టుపక్కలా కేటాయించిన 280 ఎకరాల భూమిపై సీఎం, ఆయన అనుచరుల కన్నుబడిందని దుయ్యబట్టారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థను వేధించి నిష్క్రమించేలా చేశారన్నారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దుతో మొదలుపెట్టి ఆ సంస్థను నానా రకాలుగా వేధించారని తెలిపారు. మిగతా 2లో.



# జూబ్లీహిల్స్ బరిలో మాగంటి సునీత..

## బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్

**దివంగత మాగంటి గోపీనాథ్ అర్ధాంగి సునీతకు టికెట్**

**మాగంటి సేవలకు గుర్తింపుగా కుటుంబానికే అవకాశం**



2లో.

# దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల దోషి అసదుల్లా అక్తర్ ఉరిశిక్షపై సుప్రీంకోర్టు స్టే


- ఉరిశిక్ష అమలుపై తాత్కాలికంగా స్టే విధించిన సుప్రీంకోర్టు
- నిందితుడి ప్రవర్తన, మానసిక స్థితిపై నివేదికలు కోరిన ధర్మాసనం
- ఎనిమిది వారాల్లోగా నివేదికలు ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- తదుపరి విచారణను 12 వారాలకు వాయిదా వేసిన కోర్టు



2లో.

# కాళేశ్వరం కేసులో రంగంలోకి సీబీఐ బృందాలు!

- కీలక నివేదికలు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ
- జస్టిస్ పీసీ ఘోష్, ఎన్‌డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికల సేకరణ
- నివేదికల పరిశీలన తర్వాత ప్రాథమిక విచారణపై నిర్ణయం
- కేసు నమోదుకు కేంద్రం, గవర్నర్ అనుమతులు కీలకం



# సింగరేణి సహా కోల్ ఇండియా కార్మికులకు రూ. 1,03,000 ప్రోత్సాహకం

**వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**మొత్తం 2.47 లక్షల మంది కార్మికులకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకం**

హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
సింగరేణి ఉద్యోగులకు కోల్ ఇండియా దసరా బోనస్‌ను ప్రకటించింది. ఉద్యోగుల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



మిగతా 2లో.

# భారత ఫార్మాకు ట్రంప్ షాక్..

## మందులపై 100 శాతం సుంకాలు!

హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఫార్మా రంగానికి భారీ షాక్ ఇచ్చేలా సంచలన నిర్ణయం తీసుకున్నారు. బ్రాండెడ్, పేటెంట్ పొందిన ఔషధాల దిగుమతిపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. అయితే, అమెరికాలో తయారీ ప్లాంట్లను నిర్మిస్తున్న కంపెనీలకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ ప్రకటన చేశారు. "అమెరికాలో ఫార్మాస్యూటికల్ తయారీ ప్లాంట్‌ను నిర్మించని ఏ కంపెనీ దిగుమతి చేసుకున్నా, 2025 అక్టోబర్ 1 నుంచి 100 శాతం సుంకం విధిస్తాం. ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించినా లేదా నిర్మాణంలో ఉన్నా ఈ సుంకాలు వర్తించవు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దేశీయ తయారీని ప్రోత్సహించడం, ప్రభుత్వ బడ్జెట్ లోటును తగ్గించడంతో పాటు జాతీయ భద్రత కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. ఔషధాలతో పాటు కిచెన్ కేబినెట్లు, ఫర్నిచర్, భారీ ట్రక్కుల వంటి ఇతర వస్తువులపైనా ఆయన దిగుమతి సుంకాలను పెంచారు.ఈ నిర్ణయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఎందుకంటే భారత ఫార్మా ఉత్పత్తులకు అమెరికానే అతిపెద్ద ఎగుమతి మార్కెట్. ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకారం, 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి జరిగిన మొత్తం 27.9 బిలియన్ డాలర్ల ఫార్మా ఎగుమతుల్లో సుమారు 31 శాతం, అంటే 8.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 77,231 కోట్లు) విలువైన ఉత్పత్తులు అమెరికాకే వెళ్లాయి. అమెరికాలో వినియోగించే జెనరిక్ మందుల్లో 45 శాతానికి పైగా భారత్ నుంచే సరఫరా అవుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్ లైఫ్‌సైన్సెస్ వంటి అనేక ప్రముఖ భారతీయ కంపెనీలు తమ ఆదాయంలో 30 నుంచి 50 శాతం వరకు అమెరికా మార్కెట్‌పైనే ఆధారపడి ఉన్నాయి.

ప్రస్తుతానికి ఈ సుంకాలు బ్రాండెడ్, పేటెంట్ మందులకే పరిమితమని చెప్పినప్పటికీ, భవిష్యత్తులో కాంప్లెక్స్ జెనరిక్స్, స్పెషాలిటీ మందులపైనా ఈ ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఈ సుంకాల వల్ల అమెరికాలో మందుల ధరలు విపరీతంగా పెరిగి, ద్రవ్యోల్బణానికి దారితీయడంతో పాటు ఔషధాల కొరత కూడా ఏర్పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే తక్కువ లాభాలతో పనిచేస్తున్న భారత కంపెనీలకు ఈ అదనపు భారం మోయలేనిదిగా మారవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కాళేశ్వరం కేసులో రంగంలోకి సీబీఐ బృందాలు!

హైదరాబాద్ **సెప్టెంబర్26(జర్నలిస్ట్ వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవకతవకల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఎట్టకేలకు రంగంలోకి దిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు, ఈ కేసులో ప్రాథమిక ఆధారాల సేకరణకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే దర్యాప్తునకు సంబంధించిన కీలక సమాచారాన్ని, నివేదికలను తమకు అందించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి గురువారం సీబీఐ అధికారులు లేఖ రాసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), రాష్ట్ర విజిలెన్స్ కమిషన్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలన్నింటినీ తమకు పంపించాలని సీబీఐ తన లేఖలో కోరినట్లు సమాచారం. ఈ పరిణామంతో సీఎస్ సంబంధిత శాఖల అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అధికారికంగా లేఖ రాసింది. గత కేసీఆర్ ప్రభుత్వం సీబీఐ విచారణలకు అనుమతి నిరాకరిస్తూ జారీ చేసిన జీవో 51ని పక్కనపెట్టి, కేవలం కాళేశ్వరం కేసుకు మినహాయింపునిస్తూ రేవంత్ సర్కారు జీవో 104ను విడుదల చేసింది.ప్రభుత్వం నుంచి అందే నివేదికలను సీబీఐ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వాటిలో నేరాన్ని నిరూపించే ప్రాథమిక సమాచారం ఉందని నిర్ధారణకు వస్తే, న్యాయవిభాగం సలహా తీసుకుని ప్రాథమిక విచారణ (పీఈ) నమోదు చేస్తారు. ఈ కేసులో పలువురు ప్రభుత్వ అధికారులు, ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఉన్నందున పూర్తిస్థాయిలో కేసు నమోదు చేయడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు ప్రారంభించాలంటే కేంద్రం నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా, ప్రజాప్రతినిధులపై కేసు నమోదు చేయాలంటే గవర్నర్ అనుమతి కూడా అవసరం. ఈ చట్టపరమైన ప్రక్రియలన్నీ పూర్తయ్యాకే సీబీఐ పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎల్ అండ్ టీపై పగ

(మొదటి పేజి తరువాయి)
మేడిగడ్డ విషయంలో తామే మరమ్మతులు చేస్తామని ఎల్ అండ్ టీ ముందుకురావడం రేవంత్ రెడ్డికి కంటగింపుగా మారిందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "2014లో మేము అధికారంలోకి వచ్చే నాటికి మెట్రో పనులు కేవలం 20-25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కేవలం మూడేండ్లలోనే 2017 నవంబర్ 29న ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా మొదటి దశను ప్రారంభించాం.కరోనా కష్టకాలంలోనూ సంస్థ నష్టాల్లో ఉందని భయపడితే, కేసీఆర్ మరోసారి అండగా నిలిచి, రూ.3,000 కోట్ల వడ్డీలేని రుణం (సాఫ్ట్ లోన్) మంజూరు చేసి, అందులో రూ.900 కోట్లు విడుదల చేసి మెట్రోను కాపాడారు. మా ప్రభుత్వ హయాంలో రోజుకు 5 లక్షల మంది ప్రయాణించే స్థాయికి, పీక్ అవర్స్‌లో కోచ్‌లు సరిపోనంతగా మెట్రోను అభివృద్ధి చేశాం. 69 కిలోమీటర్ల లైన్ పూర్తి చేసి, దేశంలోనే రెండో అతి పెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాం. కాంగ్రెస్ హయాంలో ఆవాస హౌటల్ వరకే ఉన్న లైన్‌ను, లక్షలాది ఐటీ ఉద్యోగులు పనిచేసే మైండ్ స్పేస్ వరకు పొడిగించి, స్కైవాక్‌లు నిర్మించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాం".. అని కేటీఆర్ తెలిపారు."మేము అధికారం నుంచి దిగిపోయే ముందు, హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 400 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించాం. ఓఆర్ఆర్ చుట్టూ 160 కిలోమీటర్లు, భువనగిరి, సంగారెడ్డి,



షాద్‌నగర్, కడ్తాల్ వరకు విస్తరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపాం. అత్యంత కీలకమైన మైండ్ స్పేస్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోకు టెండర్లు పూర్తి చేసి, కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాం. భూసేకరణ అవసరం లేకుండా, పిల్లర్లు లేకుండా భూమ్మీదనే నిర్మించేలా దీన్ని డిజైన్ చేశాం. కానీ, రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే తీసుకున్న మొదటి అనాలోచిత నిర్ణయం ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు. నా భూములు ఉన్నాయనీ, బీఆర్ఎస్ నేతలకు లబ్ధి చేకూరుతుందని పిచ్చి పిచ్చి ఆరోపణలతో ప్రాజెక్టును రద్దు చేసి ఎల్ అండ్ టీపై మొదటి దెబ్బ వేశారు. అప్పటి నుంచే సీఎంకు, ఎల్ అండ్ టీకి మధ్య పంచాయితీ మొదలైంది"%% అని కేటీఆర్ అన్నారు. "మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్క రూపాయి భారం పడకుండా సొంత ఖర్చులతో రిపేర్ చేస్తామని ఎల్ అండ్ టీ ముందుకు వచ్చింది. కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అని బద్నాం చేద్దామనుకున్న రేవంత్ రెడ్డి ప్రచారానికి ఇది గండికొట్టింది. తమ రాజకీయ లబ్ధికి ఎల్ అండ్ టీ సహకరించలేదనే కోపంతో సీఎం ఆ సంస్థపై పగబట్టారు. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్ మెట్రో వరకు ప్రతి విషయంలో ఆ సంస్థను వెంటాడి, వేధించారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో టెండర్ వేసిన ఎల్ అండ్ టీకి క్వాలిఫికేషన్ లేదని చెప్పి, తన అనుచరుడైన బాంబులేటి శ్రీనివాస్ రెడ్డి సంస్థకు పనులు కట్టబెట్టారు.

'మేడిగడ్డ కూలిపోయిందని చెప్పకుంటే బ్లాక్ లిస్టులో పెడతా' అని బెదిరించారు. ఈ కక్ష సాధింపు చర్యలు భరించలేకే 2070 వరకు లీజు ఉన్న ఎల్ అండ్ టీ సంస్థ రాష్ట్రం నుంచి వాకౌట్ చేసింది. 'తెలంగాణ రైజింగ్' అని చెప్పుకొనే సీఎం పెట్టుబడులకు స్వర్గధామమైన రాష్ట్రం నుంచి ఒక ప్రతిష్టాత్మక సంస్థ ఎందుకు పారిపోయిందో సమాధానం చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు అప్పు పుట్టడం లేదని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే రూ.2.20 లక్షల కోట్లు అప్పు చేశారనీ, ఇప్పుడు దానికి తోడు రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని కేటీఆర్ విమర్శించారు. ఎల్ అండ్ టీకి కేటాయించిన 280 ఎకరాల భూములను, ఉన్న మాల్స్ ను ఎవరెవరికి రాసిస్తారో త్వరలో చూస్తారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి ఒక్క స్కీంలో ఒక్కో స్కాం దాగుందని విమర్శించారు. మరో కార్పొరేట్ సంస్థను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారనో నాలుగైదు రోజుల్లో బయటపెడతానని కేటీఆర్ వెల్లడించారు.

# జూబ్లీహిల్స్ బరిలో మాగంటి సునీత..

## బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్

### దివంగత మాగంటి గోపీనాథ్ అర్ధాంగి సునీతకు టికెట్



హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థిని బీఆర్ఎస్ ఖరారు చేసింది. దివంగత సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు.

మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీలో సీనియర్ నేతగా, నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందిన గోపీనాథ్ కుటుంబానికే ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది.

పార్టీకి, జూబ్లీహిల్స్ ప్రజలకు మాగంటి గోపీనాథ్ అందించిన సేవలను గౌరవిస్తూ, ఆయన భార్యకు టికెట్ కేటాయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఈ నిర్ణయం ద్వారా మాగంటి గోపీనాథ్ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందనే బలమైన సంకేతాలను పంపినట్లయింది.

# రాష్ట్ర కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

(మొదటి పేజి తరువాయి)
ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి శివధర్‌రెడ్డి ఉత్తర్వులను సచివాలయంలో అందుకున్నారు. ఆయనకు పోలీస్ శాఖలో అపార అనుభవంతో పాటు చిత్తశుద్ధి, నిజాయితీ, సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరున్నది. శివధర్‌రెడ్డి 1994లో ఐపీఎస్ సర్వీసుకు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలిఖాన్ గ్రామంలో జన్మించిన శివధర్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఎల్ఎల్‌బీ వరకు విద్యాభ్యాసం చేశారు. కొంత కాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. తర్వాత సివిల్ సర్వీస్ పరీక్ష రాసిన శివధర్‌రెడ్డి ఐపీఎస్ అధికారిగా పోలీస్ శాఖకు ఎంపికయ్యారు. మొదట విశాఖ జిల్లా అనకాపల్లి, చింతపల్లి ఏఎస్పీగా పోలీసు శాఖలో విధులను ప్రారంభించిన ఆయన తర్వాత గ్రేహౌండ్స్ ఏఎస్పీగా, అనంతరం నెల్లూరు, గుంటూరు, నల్లగొండ, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ నగర ట్రాఫిక్ డీసీపీగా, దక్షిణ మండలం డీసీపీగా విధులను నిర్వహించి సమర్థుడైన అధికారిగా పేరు పొందారు.ఆ తర్వాత ఇంటర్నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యాన కొసావో శాంతి పరిరక్షక దళంలో పని చేసిన ఆయన.. ఆ తర్వాత యాంటీ నక్సలైట్ నిఘా విభాగం (ఎస్ఐబీ) డీఐజీగా విధి నిర్వహణ సాగించారు. అనంతరం ఏసీబీ డైరెక్టర్‌గా పని చేసిన ఆయన 2012 నుంచి 2014 వరకు వైజాగ్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 జూన్ 2న తెలంగాణ కొత్త రాష్ట్రంగా అవతరించాక రాష్ట్ర తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ సమయంలోనే గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగింది. అనంతరం కొద్ది రోజుల తర్వాత కొన్ని కారణాలతో ప్రభుత్వం ఆయనను అక్కడి నుంచి ఆకస్మికంగా బదిలీ చేసింది. తెలంగాణకు బలమైన మద్దతుదారుడిగా పేరు పొందిన శివధర్‌రెడ్డిని ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయటం ఆ సమయంలో చర్చనీయాంశంగా మారింది.ఆ తర్వాత రైల్వే, రోడ్డు భద్రత విభాగం ఐజీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి డీజీపీ కార్యాలయంలో కోఆర్డినేషన్ ఐజీ, అదనపు డీజీగా దాదాపు ఎనిమిదేండ్ల పాటు పని చేసిన ఆయన.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తిరిగి నియమితులయ్యారు. అక్కడే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాకు పదోన్నతి పొందిన శివధర్‌రెడ్డి.. తాజాగా రాష్ట్ర పోలీస్ బాస్ డీజీపీగా నియమితులయ్యారు. వివిధ హోదాల్లో ఆయన పని చేస్తూ ముఖ్యంగా సీపీఐ(మావోయిస్టు) కార్యకలాపాల అణచివేతలోనూ, అజ్ఞాతంలో ఉన్న అనేక మంది తీవ్రవాదులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావటంలోనూ ప్రత్యేక కృషి సల్పారు. ఐఎస్ఐ ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో సైతం శివధర్‌రెడ్డి కీలక పాత్రను నిర్వహించారు.

# పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు

(మొదటి పేజి తరువాయి)
అందోల్ మండలం అల్మాయిపేట బ్రిడ్జీ నీటిలో మునిగిపోయింది. దాంతో అల్మాయిపేట, కొన్యాల-పన్యాల, చౌటకూర్ మద్యన రాకపోకలు నిలిచిపోయాయి. సింగూరు నుంచి పాపన్నపేట మండలంలోని ఘనపూర్‌కు నీళ్లు వస్తుండటంతో ఏడుపాయల దుర్గభవానీ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సంగారెడ్డిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోకి భారీగా వరద నీరు చేరడంతో కూరగాయా ల దుకాణాలు నీట మునిగాయి.పటాన్‌చెరులోని 65వ జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ముత్తంగి రింగ్‌రోడ్ నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మెదక్ జిల్లా దూప్ సింగ్ తాండా నీటి మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలో ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏట్ల ఎర్రవల్లి, దేవరాంపల్లి, టంగుటూరు, మోకిలా, పామేనా వాగులు ఉప్పొంగుతున్నాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కురిసిన కుండపోత వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. పరిగి నస్కల్ వాగు, బూరుగుపల్లి, మైలార్ దేవర్‌పల్లి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో స్థానిక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**ఉమ్మడి వరంగల్‌కు ఆరెంజ్ అలెర్ట్ జారీ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ ప్రకటించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద శుక్రవారం సాయంత్రం 8,35,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దాంతో 85 గేట్లను ఎత్తి అంతే నీటిని కిందికి వదులుతున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు 15.280 మీటర్లకు చేరుకొని వరద ప్రవహిస్తుంది. దాంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద ఇదేవిధంగా పెరుగుతూ 17.33 మీటర్లకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బ్యారేజీలోకి 8.35 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నీటి మట్టం 83 మీటర్లకుగాను 82.85 మీటర్లకు వరద చేరింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని బెగుళూరు గ్రామానికి చెందిన మంద లక్ష్మి ఇంటి గోడ ప్రమాదవశాత్తు కూలిపోగా లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది.

**హైదరాబాద్‌లో రోడ్లపై భారీ వరద నీరు**

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లపై భారీగా వరద నీరు చేరింది. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, సికింద్రాబాద్, యూసఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు చేరింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలోకి వరద నీరు చేరింది. ఆస్పత్రి ఆవరణలోని నాలా కొన్ని రోజులుగా పొంగిపొర్లుతుండటంతో భారీగా వరద నీరు వచ్చింది. దాంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై స్పందించిన జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు వెంటనే రెండు యంత్రాలతో నాలాను తవ్వి నీరు సాఫీగా వెళ్లేటట్టు చేశారు. మూసీ వరద ఉధృతితో మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో వాహనాలను నిలిచివేశారు.

# సింగరేణి సహా కోల్ ఇండియా కార్మికులకు రూ. 1,03,000 ప్రోత్సాహకం

(మొదటి పేజి తరువాయి)
కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లోని 2.09 లక్షల మంది కార్మికులు, సింగరేణి కాలరీస్‌లోని 38,000 మంది కార్మికుల కృషికి గుర్తింపుగా ఒక్కొక్కరికి రూ. 1,03,000 చొప్పున పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు కిషన్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఇందులో ఉద్యోగుల బీమా కవరేజీని రూ. 1 కోటికి పెంచడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచామని తెలిపారు. ఉద్యోగులు ఎలాంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శాశ్వత ఉద్యోగులు కానివారికి కూడా బీమా రక్షణ కల్పించామని చెప్పారు.తమ నిర్ణయాలు ఉద్యోగుల సమగ్ర సంక్షేమం వైపు ఒక ముందడుగు అని కిషన్ రెడ్డి అభివర్ణించారు. ఎక్స్‌గ్రేషియాను కూడా రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలలో సీఎండీ నుంచి కార్మికుడి వరకు అందరికీ డ్రెస్ కోడ్ తీసుకువచ్చామని తెలిపారు. పండుగ సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఈ పనితీరు ప్రోత్సాహకం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు.

# దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల దోషి అసదుల్లా అక్తర్ ఉరిశిక్షపై సుప్రీంకోర్టు స్టే

హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన అసదుల్లా అక్తర్‌కు విధించిన మరణశిక్ష అమలుపై సుప్రీంకోర్టు గురువారం తాత్కాలికంగా స్టే విధించింది. కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అక్తర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. నిందితుడికి సంబంధించిన పలు అంశాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

జైలులో అక్తర్ ప్రవర్తన, అతడికి అప్పగించిన పనుల గురించి జైలు సూపరింటెండెంట్, ప్రొబేషన్ అధికారులు నివేదిక ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా, అక్తర్ మానసిక స్థితిపై ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నివేదిక తీసుకోవాలని సూచించింది. ఈ నివేదికలన్నింటినీ ఎనిమిది వారాల్లోగా తమకు సమర్పించాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను 12 వారాలకు వాయిదా వేసింది.

# టీఎన్జీవోస్‌లో ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు..




**ప్రజావినికిడి, (నాంపల్లి):**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత,తొలి భూ పోరాటానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ 129వ జయంతిని తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్జీవోస్) హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు విక్రమ్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ పాత్రను కొనియాడారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక వ్యక్తి కాదు నిజాం కాలపు దొరల వ్యవస్థపై, నిరంకుశత్వంపై తిరుగుబాటు చేసి సామాన్యుల స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ముఖ్యంగా,ఐలమ్మ విస్నూర్ దేశ్ముఖ్కు వ్యతిరేకంగా తన భూమిని కాపాడుకోవడానికి పోరాడిన తీరును గుర్తు చేశారు.తన నాలుగు ఎకరాల భూమిని దొరల గుండాలు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించినప్పుడు, చాకలి ఐలమ్మ ధైర్యంగా నిలబడి ఆ పోరాటాన్ని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఒక మలుపు తిరిగిందని అన్నారు.నా భూమి-నాదే అనే నినాదంతో ఆమె సాగించిన తిరుగుబాటు, అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని నింపి, పీడిత ప్రజల పోరాటానికి నాంది పలికింది వివరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు విక్రమ్, కార్యదర్శి కురాడి శ్రీనివాస్ మాట్లాడుతూ,చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఒక ఆదర్శంగా నిలవాలని ఉద్ఘాటించారు.ఐలమ్మ పోరాటం నుండి మనం అన్యాయాన్ని ఎదిరించే ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకునే సంకల్పాన్ని నేర్చుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో కె.ఆర్.రాజ్ కుమార్ అసోసియేట్ ప్రెసిడెంట్,ఈ సి మెంబెర్స్ వైదిక శాస్త్ర, ముకీమ్ ఖురేషి, ఈ.ఎన్.టి.హాస్పిటల్ అధ్యక్షుడు రాజు, ఉస్మాన్ అలీ ఉస్మాని, రామకృష్ణ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఏపీఆర్ఓ మహ్మద్ వహీద్,వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మకు పుష్పాంజలి ఘటించారు.చాకలి ఐలమ్మ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

# అన్నదానం మహాదానం

## ఈస్ట్ జోన్ అడిషనల్ డిసిపి నర్సయ్య



**ప్రజావినికిడి,(అంబర్ పేట్):**
అన్నదానం మహాదానమని ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య అన్నారు. గోల్నాకలోని శాంతినగర్ లో కత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జే.నర్సయ్య హాజరయ్యారు. ముందుగా అమ్మవారి పూజను చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు.ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస ఎక్స్క్లూజివ్ టెక్స్టైల్స్ అధినేత వల్లకాటి సందీప్ కుమార్,నాయకులు కత్తుల సుదర్శన్ రావు, దాము,రాజు,భూపతి లక్ష్మణ్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# భారతీయ జనతా పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం



**ప్రజావినికిడి,(మెదక్):**
జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు చేతుల మీదగా పార్టీ కార్యాలయం ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, నాయకులకు కార్యకర్తలకు వారు చేసిన సూచనలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వాడు మెంబర్ నుండి సర్పంచ్,ఎంపీటీసీ, జడ్పిటిసి,కౌన్సిలర్,మున్సిపల్ చైర్మన్ పదవి వరకు కూడా మన బిజెపి నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసే ప్రతి ఎన్నికల్లో గెలుపే ముఖ్యంగా పనిచేయాలని చెప్పడం జరిగింది అదేవిధంగా నరేంద్ర మోడీ గారి సహకారంతో మెదక్ పార్లమెంటులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు నా వంతు కృషి చేస్తున్నానని వారు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు మండల అధ్యక్షులు వివిధ మోర్చాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు బూత్ అధ్యక్షులు బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ ప్రజల తెగువను,పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక.. చాకలి ఐలమ్మ

### తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి. వెంకట్ రాంరెడ్డి



ప్రజావినికిడి,(షాద్ నగర్):భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను,పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక.. నియంతలపై ఎక్కు పెట్టిన పిడికిలి..సివంగిలా తిరగబడ్డ ఆడపులి..మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా షాద్ నగర్ ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న ఆమె విగ్రహానికి తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారుఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్ రాంరెడ్డి,తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం నేతలు ఏ శ్రీనివాస్ రెడ్డి,దొడ్డి రవీందర్,రవి కుమార్ గౌడ్,మేకల వెంకటేష్,జాంగారి రవి,రాఘవేందర్,సింగపగ శివ కుమార్,మదాసి కుర్వ సంఘం నేత సింధం విఠలయ్య,మల్లేష్, తుప్పరి యాదయ్య,శేఖర్ గౌడ్,శ్రీనివాస్,నర్సింహ్మా,రాము,మనీష్,హర్షిత్,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి సారు

## నిర్మలమ్మ వేడుకోలు..

**శ్రీరంగాపూర్ గ్రామంలో నీట మునిగిన మెరుగు నిర్మలమ్మ ఇల్లు**

**ఆరు నెలలుగా పెరాలసిస్ తో బాధపడుతున్న భర్త సత్తయ్య**

**ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఆదుకోవాలని వేడుకోలు..**

**సముద్రాన్ని తలపిస్తున్న ఇంటి పరిసరాలు..**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**నియోజకవర్గ పరిధిలోని కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మెరుగు నిర్మలమ్మ ఇల్లు శుక్రవారం రోజు కురిసిన భారీ వర్షానికి నీట మునిగి సముద్రాన్ని తలపించింది.వర్షపు నీరు ఇంటిలోకి చేరి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ తడిసి ముద్దైన పరిస్థితి కుటుంబ సభ్యుల కన్నీటికి కారణమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో నిర్మలమ్మకు ఇల్లు మంజూరు కాకపోవడంతో తీవ్ర నిరాశకు గురి అయ్యింది పేద కుటుంబం.భర్త సత్తయ్య ఆరు నెలల నుంచి పేరాలసిస్ తో బాధపడుతున్నారు.నిర్మలమ్మకు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.కూలీ పనులు చేసుకుంటూ అటూ భర్తను,ఇటు పిల్లలను సాదుతున్న నిర్మలమ్మకు ఇల్లు కేటాయించాలని ఎమ్మెల్యేని,అధికారులను నిరుపేద కుటుంబం వేడుకుంటుంది.

# భవానీ మాత కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ తోడుండాలి..

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.. -అంబాభవాని మాత ఆలయంలో అమ్మవారికి అభిషేకం.. అభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు..





**ప్రజావినికిడి,షాద్ నగర్):**
భవానీ మాత కరుణాకటాక్షాలు ఆశీర్వాదాలు భక్తులపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.షాద్ నగర్ నియోజకవర్గం ఎల్లికట్ట గ్రామంలో దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అంబా భవాని మాత ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన అభిషేకంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,భవాని మాత ఆలయంలో నిర్వహించిన అభిషేకంలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని అమ్మవారిని పూజిస్తే మానసిక ప్రశాంతత, భద్రత లభిస్తాయని మన విశ్వాసమని అమ్మవారి సంపూర్ణ అనుగ్రహం అందరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముత్యాల రాజు,మాజీ ఆలయ చైర్మన్ గుల్లే కృష్ణయ్య, మాజీ సర్పంచులు ముదిగొండ సాయిప్రసాద్ యాదవ్, అచ్చ గారి యాదయ్య,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు కావలి శ్రీశైలం,రాధా క్రిష్ణ,గ్రామ అధ్యక్షుడు రామస్వామి, శేరి పరమేశ్వర్ రెడ్డి,బోయినపల్లి అశోక్ గౌడ్ ముదిగొండ సంజీవయ్య,ఆర్ల యాదయ్య,మేడిపల్లి యాదయ్య,బద్దుల నర్సింలు,బద్దుల సురేష్,బైరమొని మల్లేష్,రాజు,గడ్డమీది శ్రీను,సట్లపల్లి శ్రీను తదితరులు పాల్గోడం జరిగింది.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన యోధురాలు చాకలి ఐలమ్మ..

### ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..
**చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నీవాళులు..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**చాకలి ఐలమ్మ భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనితని,ఆమె తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన కమ్యూనిస్ట్ యోధురాలని,ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి,తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడింది.ఆమె పోరాటం సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిందని ఎమ్మెల్సి నవీన్ రెడ్డి అన్నారు.షాద్ నగర్ పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ నందిగామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతికి వేడుకలకు ఎమ్మెల్సి నాగరకుంట నవీన్ రెడ్డి హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి నీవాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లు శ్రీనివాస్ గౌడ్,చెట్ల పావని నర్సిములు,రేటికల్ నంధీశ్వర్,మానస యాదగిరి,బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్ యాదవ్,సుజీవన్,నక్కల వెంకటేష్ గౌడ్,రఘు,పి.రమేష్,సి రమేష్,దినేష్ సాగర్,శివ తదితరులు చాకలి ఐలమ్మ కు నీవాళులు అర్పించారు.

# ముదిరెడ్డిపల్లి చెరువులోకి అరబిందో ఫార్మా కంపెనీ వదులుతున్న కలుషిత జలాలు..

**-జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి అల్టిమేట్టం..**
**ఒక రోజులో అధికారులు చర్యలు చేపట్టకపోతే -అరబిందో ఫార్మాను ఆదివారం తగులబెడతా..**







**ప్రజావినికిడి,(జడ్చర్ల):**
ఒక్కరోజులో అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో అన్నంత పని చేస్తా. అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు తగులబెడతానని హెచ్చరించినా అరబిందో పట్టించుకోవడం లేదు రైతులకు అన్యాయం జరుగుతుంటే ఇక చూస్తూ ఊరుకోలేను అధికారులకు, అరబిందోకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అల్టిమేటం మీడియాకు ఫోటోల, వీడియోల విడుదల అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా,పలుమార్లు హెచ్చరించినా అరబిందో ఫార్మా కంపెనీ ముద్దిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదలడం ఆపడం లేదని,ఈ వ్యవహారంలో తక్షణం చర్యలు తీసుకోవడానికి కాలుష్య నియంత్రణ మండలికి ఒక్క రోజు టైమ్ ఇస్తున్నానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అల్టిమేటం ఇచ్చారు. ఈ ఒక్క రోజులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చర్యలు తీసుకోకపోతే ఆదివారం 11 గంటలకు అరబిందో ఫార్మా వద్దకు వెళ్లి ఆ కంపెనీని తగులబెడతానని హెచ్చరించారు. ప్రస్తుతం తన కుటుంబంతో కర్నాటక యాత్రలో ఉన్న అనిరుధ్ రెడ్డి ఈ మేరకు ఒక వీడియోను శుక్రవారం మీడియాకు విడుదల చేసారు. పోలేపల్లి ఫార్మా సెజ్ లోని అరబిందో ఫార్మా కంపెనీ ముద్దిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదులుతున్న కారణంగా పంటలు పండడం లేదని, చెరువులో ఉన్న చేపలతు కూడా చనిపోతున్నాయని తాను గతంలోనే అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోలేదని చెప్పారు.ఈ విషయంలో అధికారులకు అరబిందో ఫార్మాకు మధ్య ఏ లాలూచీ ఉందో తనకు తెలియదన్నారు. మరోసారి కలుసిత జలాలను చెరువులోకి వదిలితే సహించేది లేదని,మరోసారి అలా చేస్తే అరబిందో ఫార్మా కంపెనీని తగుల బెడతానని గతంలోనే తాను హెచ్చరించానని గుర్తు చేసారు. అయినప్పటికీ తన హెచ్చరికలను పెడచెవిన పెట్టి అరబిందో ఫార్మా కంపెనీ మళ్లీ కలుషిత జలాలను చెరువులోకి వదులుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు.దీనికి సంబంధించిన వీడియోలు,ఫోటోలను కూడా మీడియాకు విడుదల చేసారు. కలుషిత జలాలను చెరువులోకి వదలడం వెంటనే ఆపాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అరబిందో పై చర్యలు తీసుకోవడానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కు శనివారం ఒక్క రోజు గడువు ఇస్తున్నానని అనిరుధ్ రెడ్డి చెప్పారు.ఈ ఒక్క రోజులో చర్యలు తీసుకోకపోతే ఆదివారం ఉదయం 11 గంటలకు తాను అరబిందో ఫార్మా వద్దకు వెళ్లి దాన్ని తగలబెడతానని హెచ్చరించారు. రైతులు నష్టపోతున్నా చూస్తూ ఊరుకొనే ఓపిక తనకు లేదన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు అరబిందో పై చర్యలు తీసుకుంటారో,లేక దాన్ని తగలబెట్టకతప్పని పరిస్థితి తీసుకొస్తారో వాళ్ల ఇష్టమని పేర్కొన్నారు.

# గోడౌన్లో పనిచేస్తూ లాకర్ ఎత్తుకు వెళ్లి తాళం విరగొట్టి డబ్బులు దొంగతనం చేసిన నేరస్తుల అరెస్టు..


**నేరస్తులను అరెస్టు చేసిన షాద్ నగర్ మరియు శంషాబాద్ సిసిఎస్ పోలీసులు**







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తాము పనిచేస్తున్న గోడౌన్ లోని లాకర్ ను దొంగతనం చేసి ఊరు బయటకు తీసుకువెళ్లి లాకర్ పగలగొట్టి అందులోని డబ్బులు దొంగతనం చేసిన నందిగామ మండలం అప్పిరెడ్డి గూడ గ్రామానికి చెందిన వి శ్రీకాంత్,షాద్ నగర్ పట్టణ అంబేద్కర్ కాలనీకి చెందిన మొదంపల్లి మధు,గుజరాత్ రాష్ట్రానికి చెంది ప్రస్తుతం షాద్ నగర్ లోని ఒక వైన్స్ లో పనిచేస్తున్న మౌలిక్ ,దిలీప్ భాయ్ దవే అను నేరస్తులను షాద్ నగర్ మరియు సిసిఎస్ శంషాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు పట్టణ సీఐ విజయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం షాద్నగర్ న్యూ నగర్ కాలనీలోని ఎన్ టి ఎక్స్ గ్రోసరీస్ గోడౌన్ మేనేజర్ ప్రవీణ్ ఫిర్యాదు ప్రకారం 2025,ఆగస్టు17వ తేదీ అందాజ రాత్రి 10 గంటల 30 నిమిషాలకు మూడు రోజులు కలెక్షన్ చేసిన డబ్బులు 4,21,292/- రూపాయలు జడ్చర్ల రోడ్డులో గల ఎన్ టిఎక్స్ కంపెనీ లాకర్లో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లి మరుసటి రోజు ఉదయం 2025 ఆగస్టు 18 తేదీ వచ్చి చూడగా షట్టర్ తాళం విరగగొట్టి లాకర్ దొంగతనం అయిందని గ్రహించి అదే రోజు షాద్ నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.
ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తులో



భాగంగా సాంకేతిక సాక్షాలు ఆధారంగా 2025 సెప్టెంబర్ 25వ తేదీ నేరస్తులను పట్టుకొని విచారించగా శ్రీకాంత్ మధులు అదే గోడౌన్ లో సరుకుల డెలివరీ డబ్బుల కలెక్షన్ జాబ్ చేస్తూ లాకర్ ఉన్న డబ్బుల విషయం తెలిసి మరో నిందితుడు అయిన మౌలిక్ ను కలుపుకొని రాత్రి సమయంలో తాము పనిచేస్తున్న గోడౌన్ షట్టర్ తాళం పగుల కొట్టి లోపల ఉన్న లాకర్ తో సహా దొంగిలించుకుని కారులో వేసుకొని ఉరి బయటకు వెళ్లి లాకర్ పగలగొట్టి అందులో ఉన్న 4,21,292 /- దొంగిలించుకుని పారిపోయినట్లు నిందితులు తెలిపినట్లు పట్టణ సిఐ విజయకుమార్ తెలిపారు. నిందితులైన శ్రీకాంత్,మధు,మౌలిక్ దగ్గర నుండి ఒక స్విఫ్ట్ కారు,మూడు సెల్ ఫోన్లు,నిందితుడు శ్రీకాంత్ వద్ద నుండి 12000/- స్వాధీనపరుచుకొని పై నేరం చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పట్టణ సీఐ విజయకుమార్ తెలిపారు.నేర పరిశోధనలో భాగంగా శంషాబాద్ డిసిపి రాజేష్,అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, సైబరాబాద్ క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, అడిషనల్ డిసిపి రామ్ కుమార్,సిసిఎస్ ఏసిపి నాగేశ్వరరావు,సిసిఎస్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అవినాష్ బాబు,శ్రీనివాస్ యాదవ్,సిసిఎస్ కానిస్టేబుల్లైన నవీన్ కుమార్,అలాగే షాద్నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో కేసు విచారణ అధికారి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు,క్రైమ్ డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ జి శివారెడ్డి, అదేవిధంగా క్రైమ్ డిపార్ట్మెంట్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్,కానిస్టేబుల్ లు మోహన్, కరుణాకర్,జాకీర్,రాజు మరియు సంతోష్ ఈ కేసు చేదనలో కీలక పాత్ర వహించినట్లు వారికి పై అధికారుల ద్వారా తగిన రివార్డులు ఇప్పించడం కూడా జరుగుతుందని పట్టణ సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

# భావితరాలకు స్ఫూర్తి ఐలమ్మ జీవితం.

**బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే.లక్ష్మణ**



**ప్రజావినికిడి,(మెట్టుగూడా):**
భూమికోసం భుక్తి కోసం బానిస బతుకుల విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ సాయుధ పోరాటం చేసిందని నిజాం నవాబుకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ అన్నారు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రజక సెల్ అధ్యక్షులు మల్లేశ్వరపు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఐలమ్మ130 వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కౌలుకు తీసుకొని తాను పండించిన పంటను దేశముఖ్ రేపాక రామ్ చంద్రరెడ్డి తన అనుచరులతో ధాన్యాన్ని దొంగతనంగా తరలించుకొని పోవడానికి ప్రయత్నించగా వారిని ఎదిరించి తరిమికొట్టిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందని అన్నారు. బాంచన్ కాల్మొక్త అన్న బానిస బ్రతుకుల నుండి బడుగులను విముక్తి చేసిన వీరవనిత ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి ఐలమ్మ జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చాలని హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏదైనా జిల్లాకు ఐలమ్మ పేరును నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ బుర్ర నరసయ్య గౌడ్ ఆకారం రమేష్ సురేందర్ యాదవ్ కిరణ్ గౌడ్ కరణ్ శైలేందర్ శ్రీనివాస్. నర్సింగ్ చందు సంజయ్ గనాటే సంపత్ హైమా రెడ్డి ప్రసన్న లక్ష్మీ ప్రసన్న ప్రియా కావ్య కిరణ్మయి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయం

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
షాద్ నగర్ ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు
హాజరైన రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు..



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**చాకలి ఐలమ్మ పోరాటం కేవలం వ్యక్తిగత పోరాటం కాదని,అది నిజాం పాలన,దొరల పెత్తనంపై తెలంగాణ సమాజం చేసిన సబ్బండ వర్గాల తిరుగుబాటుకు ప్రతీక అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు.తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా షాద్ నగర్లో ఘనంగా నివాళులు అర్పించారు.శుక్రవారం షాద్ నగర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఐలమ్మ చూపిన ధైర్యం,పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయం అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను,అందులో ఐలమ్మ వంటి వీరవనితల పాత్రను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు,కుల సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షం గళం విప్పితేనే ప్రజల సమస్యలు తీరుతాయి

**మంత్రి శ్రీధర్ బాబు ద్వార జర్నలిస్టుల కలలు నెరవే రుతాయని విశ్వాసం ఉంది**
**ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి స్పష్టం..**







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తూ సమాజ వికాసం కోసం ఆహర్నిషలు శ్రమిస్తున జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని.ఉమ్మడి ఎమ్మెల్సీ ఎన్ నవీన్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోశుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలకు హాజరైన ఆయన జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలో 1140 జర్నలిస్టులకు హెల్త్ కార్డులు,ఇంటి స్థలాలు,అక్రిడేషన్ కార్డులు ఇతరత్ర సదుపాయాలు రాష్ట్ర డైనమిక్ లీడర్,మంత్రి శ్రీధర్ బాబు ద్వార మీ కలలకు సాకారం అవుతాయని నాకు గట్టి విశ్వాసం ఉందని చమత్కరి%శీ%చ్చారు.ప్రతిపక్షం గళం విప్పితేనే ప్రజల సమస్యలు తీరుతాయని విశ్వసించారు.విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడంలో జర్నలిస్టుల కృషి గర్వించదగినదన్నారు.ప్రధానంగా షాద్ నగర్ నియోజకవర్గం జర్నలిస్టుల పాత్ర హర్షించదగ్గదని సభలో పేర్కొనడం హార్ట్ టాపిక్ గా మారిది.

# కొత్తపేట గ్రామ పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించిన గ్రామ బిజెపి యువ నాయకులు: పాలాది శ్రీనివాస్



**ప్రజావినికిడి,(కేశంపేట్):**దసరా పండుగ మరియు ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ గారి జన్మదిన సేవాపక్ష సందర్భాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని కొత్తపేట గ్రామ పారిశుద్ధ సిబ్బందిని సన్మానించి నూతన వస్త్రాలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో పాలాది శ్రీనివాస్ మాట్లాడుతూట్ పారిశుద్ధ కార్మికులు కష్టపడి చేస్తున్న సేవలకు హృదయపూర్వక కృతజ్ఞతను తెలియ చేశారు మన కొత్తపేట గ్రామానికి మీరు చేస్తున్న సేవలకుకొత్త బట్టలు అందజేయడం చిన్న కానుక అయినప్పటికీ,అది మన కృతజ్ఞతకు ప్రతీక మీ కృషి ప్రతి ఇంటిని ప్రతి వీధిని వెలిగిస్తుంది.మీ సేవలతో మన కొత్తపేట గ్రామం మరింత అందంగా ఆదర్శంగా ముందుకు సాగాలని మీరు ఆయురారోగ్యాలతో అభివృద్ధితో ముందుకు సాగాలని అమ్మవారి ఆశీస్సులు కోరుతూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు,అవకాశాన్ని అందించిన గ్రామ సిబ్బందికి సెక్రటరీకి అన్నివేళలా తమకు సహాయ సహకారాలు అందిస్తున్న గ్రామ యువకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఈరోజు తమ సేవలను గుర్తించినటువంటి పాలాది శ్రీనివాస్ కి పారిశుద్ధ కార్మికులు ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే

**నాలుగు కొత్త పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుంది**

**నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు**


**లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పని**

**వైకాపా హయాంలో దెబ్బతిన్న రాష్ట్రం ఇమేజ్**

**త్వరలోనే ఐటీ హబ్‌గా విశాఖపట్టణం**

**అసెంబ్లీలో సిఎం చంద్రబాబునాయుడు**

అమరావతి **సెప్టెంబర్26ప్రజావినికిడి** కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే ఉన్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. కొత్తగా వచ్చే నాలుగు పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుందన్నారు. పోర్టుల నిర్మాణంలో టార్గెట్‌లు పెట్టుకుని పనిచేస్తున్నాం. ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కూడా వస్తున్నాయి. రవాణాకు ఇన్‌లాండ్ మార్గాలు ఉపయోగించుకుంటాయి. ప్రపంచంలో నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పనిచేస్తున్నారు. ఆ రంగంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తాం అని వివరించారు. లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. వైకాపా పాలనలో పరిశ్రమల యజమానులను బెదిరించి పంపించేశారు. దాంతో పెట్టుబడి దారులకు మన రాష్ట్రంపై నమ్మకం పోయింది. వైకాపా హయాంలో రాష్ట్రం ఇమేజ్‌ను బాగా దెబ్బతీశారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించేందుకు అనేక చర్యలు చేపట్టాం. అన్ని రకాలుగా అండగా ఉంటామని పెట్టుబడి దారులకు నమ్మకం కల్పించాం. త్వరలోనే విశాఖ ఐటీ హబ్‌గా మారుతుంది. విశాఖకు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సంచర్ వస్తున్నాయి.



2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. డిమాండ్ మేరకు టెర్మినళ్లు, రన్‌వేలు విస్తరిస్తాం. దసరా ఉత్సవాల్లో కోల్‌కతా, మైసూర్ సరసన విజయవాడను చేర్చాం అని చంద్రబాబు వివరించారు. వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలని సూచించారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయం రూ.24.01 లక్షల కోట్లుగా ఉందని చెప్పుకొచ్చారు. జీడీపీలో లాజిస్టిక్స్ వాటా 7.97 శాతంగా ఉందని వివరించారు. రవాణా రంగంలో రోడ్ల ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉందని తెలిపారు. లాజిస్టిక్స్‌కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుందని వెల్లడించారు. ఇది ఉత్పత్తిదారులు, వినియోగదారులతోపాటు- అందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ఎకో సిస్టమ్‌లో రైలు, రోడ్డు, జల రవాణాతోపాటు- పైప్‌లైన్ మార్గం కూడా కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. పైప్‌లైన్ ద్వారా గ్యాస్, నీరు, స్లర్రీ లాంటివి రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ ద్వారా హైయ్యర్ కార్గో రవాణా చేస్తే వ్యయం తక్కువ అవుతుందని వివరించారు. ఏపీకి ప్రస్తుతం డ్రై పోర్టుల ప్రాజెక్టులు పెద్దఎత్తున వస్తున్నాయని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఎకో సిస్టమ్ లో మౌలిక సదుపాయాలే ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఉద్ఘాటించారు. దీని కోసం ఓ బ్లూ ప్రింట్ తయారు చేసి వ్యయం తగ్గించటమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశ లాజిస్టిక్స్ కాస్ట్ రూ.24 లక్షల కోట్లు-. పాత్ హోల్స్ ఫ్రీ రోడ్లు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. డబ్బులు ఎంతైనా ఫర్వాలేదు.. అయితే పాత్ హోల్ ఉంటే వదిలిపెట్టనని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఆదేశించాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బ్లాక్ సాయిల్ అవ్వడంతో వెంటనే రోడ్లు దెబ్బతింటున్నాయి. రాయలసీమలో ఆ ఇబ్బంది ఉండదు. మొదట్లో గుంతల మూలంగా కోల్‌కత్తా నుంచి చెన్నైకి వెళ్లాలంటే నాలుగైదు రోజులు పట్టేది. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయితో మాట్లాడి స్వర్ణ చతుర్భుజికి శ్రీకారం చుట్టాం. రోడ్లు నాగరికతకు చిహ్నం. 4,739 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఏపీలో ఉన్నాయి. వెయ్యి స్కేర్ కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయి. ఇప్పుడున్నవి కాకుండా రెండు లైన్లు, నాలుగు రైల్వే లైన్లు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అలాగే హైస్పీడ్ రైల్వే కారిడార్‌కూ కేంద్రం అంగీకరించింది' అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. హైదరాబాద్- బెంగళూరు కారిడార్, హైదరాబాద్- చెన్నై కారిడార్ నాలుగు లైన్ల రైల్వే లైన్లు రాబోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నంలో రైల్వేజోన్‌ను ఏర్పాటు- చేశాం. ఆంధ్రప్రదేశ్ నుంచి హైస్పీడ్ రైళ్లు కూడా వెళ్లనున్నాయి. 1053 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఏపీకి ఉంది. గుజరాత్ తర్వాత 320 మిలియన్ టన్నుల కెపాసిటీ-తో మనం హ్యాండిల్ చేయొచ్చు. అయితే 12 మిలియన్ టన్నులను మాత్రమే.. ఇప్పుడు హ్యాండిల్ చేయగలిగే రెండో స్థానంలో ఏపీ ఉంది.

# బెల్లంతో బోలెడు ప్రయోజనాలు..

హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి**
బెల్లంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వైద్యులు సైతం కొంతమంది పేషెంట్లకు పంచదారకు బదులు బెల్లం తీసుకోమని చెబుతుంటారు. అందులోని ఔషధ గుణాలు శరీరానికి మేలు చేస్తాయి. బెల్లంలో యాంటీ యాక్సిడెంట్లు మినరల్స్ ఐరన్ జింక్ క్యాల్షియం పొటాషియం సోడియం వంటి పోషకాలు ఉంటాయి. రుచికి మాత్రమే కాదు ఆరోగ్యాన్ని పెంపొందించే స్వచ్ఛమైన బెల్లాన్ని ఎంపిక చేసుకోవడం మంచిది. బెల్లంలో ఉండే ముఖ్యం దాతవు ఐరన్ ఇది. శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారు. బెల్లం తీసుకోవడం ద్వారా అధిక ప్రయోజనం ఉంటుంది. బెల్లంలోని యాంటీ యాక్సిడెంట్లు ఖనిజాలు సైటో ప్రొటెక్ట్ వ్ నాణ్యతను అందిస్తాయని అధ్యాయనాల్లో తేలింది. అంటే ఊపిరితిత్తుల నుండి సమస్యను తొలగించడమే కాకుండా లోపలి నుంచి శ్వాసకోశ జీర్ణ వ్యవస్థలను శుభ్రపరచడంలో దోహదపడతాయి. ప్రతిరోజు ఒక్కసారైనా బెల్లం తీసుకుంటే అది శరీరం మొత్తాన్ని సుభ్ర పరుస్తుంది.




భోజనం తర్వాత కొంతమందికి బెల్లం ముక్క నోట్లో వేసుకోవడం అలవాటు బెల్లం జీర్ణాశయంలో ఎంజఎంలో విడుదలకు దోహదం పడుతుంది. తద్వారా జీర్ణ సమస్యలు మలబద్ధకం సమస్యలు నయమవుతాయి. బెల్లం లో యాంటీ మైక్రోబయల్ గుణం వల్ల నిద్రించే ముందు బెల్లం తినడం వల్ల చర్మం ప్రభావవ%శీ%తంగా మారుతుంది. రాత్రి పాలలో బెల్లం కలిపి తాగితే మంచి నిద్ర పడుతుంది. ఉదయాన్నే శక్తివంతంగా ఉంటారు. సి విటమిన్ కు సంబంధించిన మూలం బెల్లంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. బెల్లంలోని పొటాషియం సోడియం ఐరన్ రక్తపోటు నియంత్రణలో సాయపడతాయి హైపర్ టెన్షన్ సమస్యను దూరం చేసుకోవచ్చు ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రిస్తుంది. బరువు పెరగడాన్ని ఉబకాయం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బెల్లం తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు కనిపిస్తుంది. బరువు తగ్గేందుకు ప్రయత్నిస్తున్న వారు బెల్లం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. గ్లాస్ పాలు లేదా నీటిలో బెల్లాన్ని కలిపి తాగితే పొట్టను చల్లబరిచి గ్యాస్ ఉబ్బరాన్ని నివారిస్తుంది. గ్యాస్ సమస్య ఉన్నవారు ప్రతిరోజు భోజనం తర్వాత బెల్లం తీసుకోవడం తప్పనిసరి చేసుకోవాలి. శక్తి కోసం లేదా నీరసం బలహీనత లక్షణాలు కనిపించగానే బెల్లం సేవించినట్లయితే ఎనర్జీ లెవెల్ త్వరగా పెరుగుతుంది. రోజంతా పనిచేసిన తర్వాత అలసటగా అనిపిస్తే వెంటనే బెల్లాన్ని తింటే మంచి ఫలితం ఉంటుంది.

# అన్నా మీ ఊరు ఎవరికి.?

## - ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నాయకులు

హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి**
గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో ఎక్కడ చూసినా రిజర్వేషన్ల పై చర్చతో గ్రామాల్లో రచ్చబండలు బిజీ గా మారిపోయాయి. పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు దసరాకు పండుగకు ఊరికి వచ్చేవారిని మచ్చిక చేసుకునేందుకు ఆశావాహులు ఆరాటపడుతుండగా గ్రామాల్లో ఇప్పటికే అన్నా మీ ఊరు ఎవరికి రిజర్వేషన్ అవుతుంది..? ఎస్సీ కా, బీసీ కా ,మహిళలకా, జనరల్ కా అని ఆశావహులు గ్రామాల్లో ఒకరికొకరు చర్చించుకుంటున్నారు. ఎస్సీ అయితే నేను ఉంటా, బీసీ అయితే నువ్వుండు, జనరల్ అయితే ఫలానా రెడ్డిని పెడదాం, అంటూ రచ్చబండల వద్ద ఆయా పార్టీల నాయకులు మాట్లాడుకుంటున్న మాటలు ఇవి. గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావహులు ప్రభుత్వం ప్రకటించే రిజర్వేషన్ల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల అంటూ ప్రకటన చేయడంతో ఆశావాహులు తమ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. అధికారులు సర్పంచ్ వార్డు సభ్యుల



గుర్తులను ఇప్పటికే ఖరారు చేశారని సమాచారం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన తాము సిద్ధంగా ఉన్నామని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ నేతల్లో ఉత్సాహం మరింత పెరిగింది. గ్రామాల్లో సైతం ఒకవైపు కాంగ్రెస్ పార్టీ మరోవైపు బీ.ఆర్.ఎస్. ,బీ.జే.పీ నాయకులు తమ తమ పార్టీ అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఎక్కువ మొత్తంలో స్థానాలను తమ పార్టీకి చెందిన వారే గెలవాలంటే తమ పార్టీకి చెందిన వారే గెలువాలనే పట్టుదలతో పార్టీల నాయకులు ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా గ్రామాల్లో మంచి పేరున్న అభ్యర్థులపై పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు రిజర్వేషన్ల ప్రచారం చూస్తూ నాయకుల ఆశలు కొందరివి నిరాశలవుతున్నాయి.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది.. :ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..



బాధిత అక్క సుగుణ కు 1,50,000 రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి

**ప్రజావినికిడి ,(ఎల్బీనగర్):**హయత్ నగర్ డివిజన్ పరిధిలోని పెద్దమ్మ బస్తి నందు నివాసం ఉండే ముత్తయ్య కడుపునొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 1,50,000(ఒక లక్ష యాభై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో భారస నాయకులు ముద్దగోని సుమన్ గౌడ్,ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.ద

# దీపం-2 పథకం... లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1,704 కోట్లు జమ చేశాం: నాదెండ్ల మనోహర్

అమరావ **సెప్టెంబర్26ప్రజావినికిడి**
ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'దీపం-2' పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.1,704 కోట్ల సబ్సిడీని విడుదల చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం నాడు శాసనమండలిలో 'సూపర్-6' హామీలపై జరిగిన చర్చలో ఆయన ఈ వివరాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.04 కోట్ల కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.
ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి లబ్ధిదారులకు 2.55 కోట్ల గ్యాస్ సిలిండర్లను రీఫిల్ చేసినట్లు మంత్రి వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడమే లక్ష్యంగా దీపం-2 పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు సిలిండర్ బుక్ చేసుకుని, డెలివరీ తీసుకున్న వెంటనే సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.ఇటీవల సెప్టెంబర్ 4న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన కుటుంబాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు నాదెండ్ల మనోహర్ గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని 23,912 గిరిజన కుటుంబాలు వినియోగిస్తున్న 5 కిలోల గ్యాస్ సిలిండర్లను 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్లుగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. రూ.5.54 కోట్ల అంచనా వ్యయంతో 16 జిల్లాల్లోని గిరిజన కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

# మూసీ విశ్వరూపం



హైదరాబాద్ **సెప్టెంబర్26ప్రజావినికిడి ,:** రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు పడిపోవడంతో రహదారులపై ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్‌లో కురిసిన వర్షాలకు మూసీ నది ఉగ్రరూపం దా ల్చి, వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఫలితంగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వ రద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. జంట జలాశయాలయిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లోకి భారీగా వరద నీరు చేరుతోంది. క్ర మంగా వరద నీరు పెరగడంతో జలాశయాల గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. ఓఆర్‌ఆర్ మంచిరేవుల, నార్సింగ్ వద్ద సర్వీస్ రహదారిపై నీరు పొటెత్తడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. చాదర్‌ఘాట్ చిన్నబ్రిడ్జిపైకి వరద ప్ర వాహం చేరడంతో అధికారులు ఈ చిన్నబ్రిడ్జిని మూసివేశారు. మూసీ పరీవాహక ప్రాంతమైన మూసానగర్, శంకర్‌నగర్‌లో సుమారు వంద ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెగని వర్షాలకు నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వేల ఎకరాలు పంట నీట మునిగింది. నిర్మల్ జిల్లాలో కురిన వర్షాలకు సుమారు ఆరు వేల ఎకరాల్లో పత్తి, సోయాబీన్, వరి పంటలు దెబ్బతిన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం బెంగుళూరు గ్రామంలో ఇంటి గోడ కూలడంతో మంద లక్ష్మి అనే మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. ఆమె భర్త దుర్గయ్యకు గాయలు కావడంతో మహదేవ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.రంగారెడ్డి జిల్లా గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఎన్కెపల్లి సత్తయ్య అనే వ్యక్తి గుర్రంపల్లి వాగు దాటేందుకు ప్రయత్నించగా వరద ప్రవహంలో కొట్టుకుపోయాడు. కొద్దిసేపటి తరువాత పంట పొలాల పక్కన మృతదేహం లభ్యమయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామానికి చెందిన పరుశురాం అనే వ్యక్తికి చెందిన రెండు ఆవులు మేతకు వెళ్లిన క్రమంలో పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం 15 గేట్లు ఎత్తి 20, 758 క్యూసెక్కుల వరద నీటి ని దిగువన ఉన్న గోదావరికి విడుదల చేస్తున్నారు.

# ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిలదెబ్బ

## ఎగవేత దారుల్లో కనిపించని భయం -సామాన్య ఖాతాదారులే బలిపశువులు

ముంబయి **సెప్టెంబర్26ప్రజావినికిడి**
పెద్దలు ఎగవేసిన మొత్తాల కారణంగా సామాన్యులకు గుదిబండగా మారింది. సామాన్యులు రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకర్లు పెద్దల అప్పులపై నోరు మెదపడం లేదు. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. కొన్ని కేసుల్లో రుణగ్రహీతలను వదిలి బ్యాక్ అధికారులను బాధ్యులను చేస్తున్నారు. అక్రమ రుణాలకు సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. తాజాగా బ్యాంకుల్లో దోపిడీ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాకట్టు బంగారాన్నిమాయం చేస్తున్నారు. నకిలీ బంగారంతో రుణాలు ఇప్పిస్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదను మార్చేస్తున్నారు. ఇవి కొత్త తరహా మోసాలు బయట పడుతున్నాయి. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు పెద్దల విషయంలో మిన్నకుంటున్నారు. ఇకపోతే ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం



ఆదేశించినా ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండి బకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాభై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీలు వాల్యుయేషన్, కమోడిటీతో మిలితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజాగా మరో 20 శాతం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మూలధనం అవసరం ఉంటుంది.

# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### బ్రహ్మతో తొలిగా ఉత్సవాలు మొదలైనట్లు ఆచారం

### మాడవీధుల్లో కనువిందు చేయనున్న వాహనసేవలు

### రోజుకో సేవలో విహరించనున్న స్వామివారు

### చక్రస్నానంతో ముగియనున్న ఉత్సవాలు



తిరుమల,, **సెప్టెంబర్26ప్రజావినికిడి** తిరుమలేశుని ఆలయంలో నిత్యకళ్యాణం-పచ్చతోరణంగా జరిగే బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ నెల 23నుంచి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగబోతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంటోంది. బ్రహ్మదేవుడు స్వయంగా ఆరంభించిన ఉత్సవాలు కావటంతో, ఇవి 'బ్రహ్మోత్సవాలు' అయ్యాయని అంటారు. మరో వ్యాఖ్యానం ప్రకారమైతే- నవాహ్నిక దీక్షతో, నవబ్రహ్మలు తొమ్మిది రోజులు జరిపించే ఉత్సవాలు కాబట్టి ఇవి 'బ్రహ్మోత్సవాలు' అని కూడా అంటారు. తిరుమలలో జరిగే మిగిలిన ఉత్సవాలతో పోలిస్తే, ఇవి చాలా పెద్దయెత్తున జరిగేవి కాబట్టి వీటిని 'బ్రహ్మోత్సవాలు' అంటారనీ ఇంకొందరి భావన. ఈ ఉత్సవాలన్నీ పరబ్రహ్మస్వరూపుడైన శ్రీవారికి చేసే గొప్ప ఉత్సవాలు కాబట్టి వీటిని 'బ్రహ్మోత్సవాలు' అంటున్నారని మరికొందరి భావన. బ్రహ్మోత్సవాలు తొలిరోజున జరిగే 'ధ్వజారోహణం'తో మొదలవుతాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్వామివారికి సుప్రభాత, తోమాలసేవలు జరిగాక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామికి ఏకాంతంగా తిరుమంజన పక్రియ చేసి, నైవేద్యం సమర్పిస్తారు. ఆలయసన్నిధిలోని ధ్వజస్తంభంమీద పతాకావిష్కరణ చేస్తారు. స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, ఒక కొత్త వస్త్రంమీద గరుడుడి బొమ్మ చిత్రీకరించి సిద్ధంగా ఉంచుతారు. దీన్ని 'గరుడధ్వజపటం' అంటారు. దీన్ని ధ్వజస్తంభంమీద కట్టేందుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేస్తారు. గరుడధ్వజపటాన్ని ఊరేగించి, ధ్వజస్తంభం వద్దకు తెచ్చి, ఉత్సవ మూర్తులైన భోగ శ్రీనివాసుడు, శ్రీదేవి, భూదేవిల సమక్షంలో- గోధూళి లగ్నమైన మీనలగ్నంలో కొడితాడుకు కట్టి పైకి చేరుస్తారు.

ధ్వజస్తంభం మీద ఎగిరే గరుడ పతాకమే- సకల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రం. అష్టదిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వగణాలకూ ఇదే ఆహ్వానం. ఈ ఆహ్వానం అంది విచ్చేసిన దేవ, రాక్షసగణాలకు, వారివారి నిర్ణీత స్థలాలను కేటాయించి, పద్ధతి ప్రకారం, వారి నియమాల ప్రకారం నైవేద్యం రూపంలో బలిని సమర్పిస్తారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి.

ధ్వజారోహణం తర్వాత, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామిని పుష్పమాలాలంకృతుల్ని చేసి, వాహన మంటపంలో ఉన్న పెద్ద శేష వాహనంపై ఊరేగిస్తారు. అనంతరం ఉత్సవమూర్తులను రంగనాయక మంటపంలో విశ్రమింపజేస్తారు. స్వామి శేషతల్పశాయి. ఆయన కొలువున్న కొండ- శేషాద్రి. అందుకే ఏడు తలలున్న పెద్ద శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు బ్రహ్మోత్సవాలలో అతి ప్రధానమైనదిగా పరిగణిస్తారు. మొదట్లో ఈ పెద్ద శేషవాహనాన్ని తొమ్మిదోరోజు ఉదయంపూటనే ఊరేగింపునకు వినియోగించేవారు. పెద్ద శేషవాహనాన్ని ఆదిశేషుడికి ప్రతీకగా భావిస్తే, చిన్న శేషవాహనాన్ని 'వాసుకి'కి ప్రతీకగా పరిగణించటం కద్దు. రోజూ సాయంత్రం వేళలో స్వామివారిని హంస వాహనంమీద వూరేగిస్తారు. ఈ హంసవాహనం మీద స్వామి, విద్యాలక్ష్మిగా వూరేగటం విశేషం. మూడోరోజు ఉదయం శ్రీవారికి సింహ వాహనసేవ జరుగుతుంది. ఆ సమయంలో స్వామివారు వజ్రఖచిత కిరీటంతో, సకల ఆభరణాలతో అలంకృతమయి ఉంటారు. జంతుజాలానికి రాజైన సింహాన్ని మృగత్వానికి ప్రతీకగా భావిస్తారు. ప్రతిమనిషి తనలోని మృగత్వాన్ని సంపూర్ణంగా అణచి ఉంచాలనీ తలపైన ఆదిదేవుడిని ధరించాలనీ చెప్పే ప్రతీకగా ఈ సింహవాహనంపై స్వామివారు ఊరేగుతారని భక్తులు భావిస్తారు. ఆరోజు రాత్రి స్వామివారు తన ఉభయ దేవేరులతో కలిసి, అచ్చమైన భోగశ్రీనివాసునిగా ముత్యాలపందిరి వాహనంపై తిరువీధులలో ఊరేగుతారు. నాలుగోరోజు ఉదయం, స్వామివారు తన కల్పవృక్ష వాహనంలో భక్తులకు దర్శనం ఇస్తారు. కామితార్థ ప్రదాయినిగా కల్పవృక్షానికి మన పురాణ, ఇతిహాసాలలో ఓ విశిష్ట స్థానం ఉంది. ఆ కల్పవృక్షాన్ని సైతం తన వాహనం చేసుకోగలిగిన శ్రీవారు భక్తుల కొంగు బంగారమన్నది వేరుగా చెప్పేదేముంది! ఆరోజు సాయంత్రం, సర్వభూపాల వాహనంమీద స్వామివారి వూరేగింపు, భక్తులకు కనులవిందుగా సాగుతుంది. బ్రహ్మోత్సవాలలో అయిదోరోజున, స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ అవతార వూరేగింపు విధానానికి ఓ ప్రత్యేకత ఉంది. మిగిలిన అన్ని వాహనసేవలూ స్వామివారి ఆలయంలోని వాహన మండపంలో ఆరంభమైతే, మోహినీ అవతార వూరేగింపు శ్రీవారి ఆలయంనుంచే పల్లకీపై ఆరంభమవుతుంది. మోహినీ అవతారంలో ఉన్న స్వామి వజ్రాలు, రత్నాలు పొదిగిన హారాన్ని ధరించి, తన కుడిచేతితో చిలుకను పట్టుకొని ఉంటారు. ఈ హారాన్నీ, చిలుకనూ స్వామివారి భక్తురాలైన శ్రీవిల్లి పుత్తూరు ఆండాళ్ (గోదాదేవి)



# దసరా ఎఫెక్ట్...

## హైదరాబాద్-విజయవాడ హైవేపై పెరిగిన రద్దీ

**సెప్టెంబర్26ప్రజావినికిడి**



దసరా పండుగ సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నగరం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తమ సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగను కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు వెళ్తున్న ప్రయాణికులతో రహదారి కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. వాహనాలు నెమ్మదిగా కదలడంతో ప్రయాణ సమయం పెరిగిపోతోంది. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల వంటి ప్రాంతాల్లోనూ అధిక రద్దీ కనిపిస్తోంది. సొంత కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ప్రజలు భారీగా బయలుదేరడమే ఈ రద్దీకి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు, నగరంలోని ప్రధాన బస్ స్టేషన్లు కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండుగ కోసం ప్రభుత్వం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటంతో బస్టాండ్లన్నీ జనంతో నిండిపోయాయి. సొంత వాహనాల్లో వెళ్లేవారు, బస్సుల్లో ప్రయాణించేవారితో హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే అన్ని మార్గాల్లోనూ పండుగ సందడితో పాటు ట్రాఫిక్ రద్దీ నెలకొంది.

# భారత్, అమెరికా వాణిజ్య చర్చలు

## పరస్పర విశ్వాసంతో అడుగులు

## పీయూష్ గోయల్ నేతృత్వంలో బృందం వెల్లడి

న్యూఢిల్లీ, **సెప్టెంబర్26ప్రజావినికిడి** భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు- కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు- తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నా యని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు- పేర్కొంది. వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు- వాణిజ్య శాఖ వెల్లడించింది. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30-50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు- గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.

--------

# జిఎస్టీ సంస్కరణలతో 8వేలకోట్ల లబ్ది

## శాసనసభలో బిల్లుకు ఆమోదం

## పలు బిల్లులకు సభ ఆమోదముద్ర



అమరావతి,, **సెప్టెంబర్26ప్రజావినికిడి** నూతనంగా చేపట్టిన జీఎస్టీ సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రూ.8 వేల కోట్ల లబ్ధి చేకూరనుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. జీఎస్టీ లబ్ధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు- వివరించారు. జీఎస్టీ సవరణ బిల్లును ఆయన శాసనసభలో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి విప్లవాత్మక మార్పు ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదని తెలిపారు. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. శాసనసభలో ఆమోదం పొందిన 7 బిల్లులకు మండలి ఆమోదముద్ర వేసింది. సంబంధిత శాఖల మంత్రులు సభలో బిల్లులను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ- సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల సవరణ బిల్లు-2025కు శాసన మండలి ఆమోద ముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల రెండో సవరణ బిల్లు-2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల మూడో సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల నాలుగో సవరణ బిల్లు-2025, ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది. పల్నాడు జిల్లా గుండ్లపల్లికి చెందిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్యను అత్యంత దారుణంగా హత్య చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం చేయడంతో పాటు- పాడె మోశారు. రాజకీయ ప్రేరేపిత హింసకు బలైపోయిన వారికి అండగా నిలబడేందుకు ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దిశగా చర్యలు తీసుకున్నాం. తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. సీఎంతో పాటు- మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో చొరవ చూపారు. తీవ్రవాదుల హింసకు బలైపోయిన వారికి ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర గతంలో ఉంది. అదే క్రమంలో ఇప్పుడు రాజకీయ హింసకు బలైపోయిన వారికి ఉద్యోగం ఇస్తున్నారు' అని పయ్యావుల తెలిపారు. నాలా చట్టం రద్దు చేస్తూ ఏపీ శాసనసభ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. సభ ఆమోదించింది. నాలా చట్టం వల్ల స్థానికంగా ఇబ్బందులు వస్తున్నాయని. భూ మార్పిడి చాలా ఇబ్బంది అవుతోందని మంత్రి తెలిపారు. దీనివల్ల పరిశ్రమల స్థాపన, స్థిరాస్తి రంగం అభివృద్ధికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అందుకే చట్టాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని సభకు వివరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక






# ఫైనల్‌లో పాకిస్తాన్‌తో తలపడనున్న భారత్

ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరగనుంది. ఆసియా కప్ చరిత్రలో ఇరు జట్లు టైటిల్ కోసం తలపడటం ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో ఇరు జట్లు 2 సార్లు తలపడ్డాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ టీమ్ ఇండియానే గెలిచింది. అయితే ఇప్పుడు ఫైనల్, సూర్యకుమార్ యాదవ్ అండ్ టీమ్ సల్మాన్ అలీ ఆగా, అతని ఆటగాళ్లను తేలిగ్గా తీసుకోకూడదు భారత క్రికెట్ జట్టు గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లను గెలుచుకుంది, ఇందులో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ కూడా ఉంది. సూపర్-4లో రెండు మ్యాచ్‌లు గెలిచి టీమ్ ఇండియా ఆసియా కప్ 2025 ఫైనల్‌కు చేరుకుంది, దీని మొదటి మ్యాచ్ కూడా పాకిస్తాన్‌తోనే జరిగింది. సూపర్-4లో మొదటి మ్యాచ్‌లో టీమ్ ఇండియాతో ఓడిపోయిన తర్వాత పాకిస్తాన్ శ్రీలంక, బంగ్లాదేశ్‌లను ఓడించింది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం, సెప్టెంబర్ 28న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. భారతదేశం సమయం ప్రకారం ఫైనల్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ సమయంలో యూఏఈలో సాయంత్రం 6:30 అవుతుంది.గ్రూప్ దశలో ఈ రెండు జట్లు తలపడినప్పుడు భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. భారత్ తరఫున సూర్యకుమార్ యాదవ్ (47) అత్యధిక పరుగులు చేశాడు. సూపర్-4లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది, అభిషేక్ శర్మ పాకిస్తాన్ బౌలర్లను చితకబాదాడు. అతను 39 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఇప్పుడు వరుసగా మూడో ఆదివారం మరోసారి భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరగనుంది, అయితే ఇది గత రెండు మ్యాచ్‌ల కంటే పెద్దది. ఎందుకంటే ఇది టైటిల్ కోసం పోరాటం. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయి తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ ఎలాగైనా భారత్‌పై పైచేయి సాధించాలనే కసితో ఉంది. అందుకే ఈసారి కచ్చితంగా భారత్ అందుకు తగ్గట్టుగానే పకడ్బంధిగా రెడీ అవుతోంది. సెప్టెంబర్ 2022లో పాకిస్తాన్ భారత్‌ను ఓడించింది, ఆ తర్వాత భారత్ పాకిస్తాన్‌ను వరుసగా 5 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఓడించింది. హెడ్ టు హెడ్‌లో భారత్దే పైచేయి. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఆసియా కప్‌కు అధికారిక బ్రాడ్‌కాస్టర్. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.సోనీ లివ్ , ఫ్యాన్ కోడ్ యాప్, వెబ్‌సైట్‌లో భారత్, పాకిస్తాన్ ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.

## 9 ఫోర్లు, 12 సిక్సర్లతో

# వైభవ్ సంభవం

టీమిండియా అండర్ 19 ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తన తొలి ఆస్ట్రేలియా వైట్-బాల్ సిరీస్‌లో 124 పరుగులు చేసి అదరగొట్టాడు. ఇంగ్లాండ్ పర్యటనలో తన ప్రతాపం చూపించిన వైభవ్.. ఇప్పుడుమరోసారి తన బ్యాట్‌తో రుచి చూపించాడు. ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల అండర్-19 వన్డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ 110 బంతులు ఎదుర్కొని 41.33 సగటు, 112.72 స్ట్రైక్ రేట్‌తో కేవలం 124 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లలో అతడి బ్యాట్ నుంచి 9 సిక్సర్లు, 12 ఫోర్లు వచ్చాయి. ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ అండర్-19 జట్టు సిరీస్ గెలుచుకుంది. సెప్టెంబర్ 24న బ్రిస్బేన్‌లోని ఇయాన్ హీలీ ఓవల్‌లో జరిగిన రెండవ యూత్ వన్డేలో భారత అండర్ 19 జట్టు ఆస్ట్రేలియా అండర్ 19 జట్టును 51 పరుగుల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా జట్టుకు వైభవ్ సూర్యవంశీ (68 బంతుల్లో 70), విహాన్ మల్హోత్రా (74 బంతుల్లో



70), అభిజ్ఞాన్ కుందు (64 బంతుల్లో 71) అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో 49.4 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. దీనికి సమాధానంగా ఆస్ట్రేలియా 47.2 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే(3/27, 4 ఓవర్లు) మూడు వికెట్లు పడగొట్టి కీలక పాత్ర పోషించాడు. మరోవైపు కనిష్క్ చౌహాన్ పది ఓవర్లలో రెండు వికెట్లు (2/50) తీసుకున్నాడు. ఆయుష్ మాత్రే రెండు బంతుల్లోనే డకౌట్ అయి పెవిలియన్‌కు చేరడంతో భారత్‌కు గొప్ప ఆరంభం లభించలేదు. ఆ తర్వాత విహాన్ మల్హోత్రా, వైభవ్ సూర్యవంశీతో కలిసి 111 బంతుల్లో రెండో వికెట్‌కు 117 పరుగులు జోడించారు. సూర్యవంశీ 54 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. తన మైలురాయిని చేరుకున్న తర్వాత గేర్ మార్చి.. మొత్తంగా 68 బంతుల్లో 70 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతడు అవుట్ అనంతరం విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుందు భారత్ 300 పరుగులు చేయడంలో సహాయపడ్డారు.

# టీమిండియా టెస్ట్ టీమ్ నుంచి కరుణ్ నాయర్ ఔట్..

వెస్టిండీస్‌తో సొంతగడ్డపై జరిగే టెస్ట్ సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కలేదు. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లండ్ పర్యటనలో నాలుగు టెస్ట్‌ల్లో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. దాంతో అతనిపై వేటు పడింది. తాజాగా తన వేటుపై స్పందించిన కరుణ్ నాయర్ నిరాశ వ్యక్తం చేశాడు. తనను ఎందుకు తప్పించారో తెలియదని, సెలెక్టర్లనే అడగాలని తెలిపాడు.'నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మాటలు రావడం లేదు. దీని గురించి మీరు సెలెక్టర్లనే అడగాలి. ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్ట్‌లో నేను 50 పరుగులు చేశాను. తొలి ఇన్నింగ్స్‌లో నేనే టాప్



స్కోరర్‌గా నిలిచాను. జట్టుకు నా వంతు సహాయ సహకారాన్ని అందించాను. ముఖ్యంగా ఆ మ్యాచ్‌లో మేం విజయం సాధించాం. కానీ సెలెక్టర్లు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. నాకు జట్టులో స్థానం ఉంటుందని భావించాను.ప్రస్తుతానికి నేను చేయగలిగేది కూడా ఏమీ లేదు. నేను మరింత కష్టపడాలి. నా కెరీర్ గురించి నేను చాలా క్లారిటీతో ఉన్నాను. నా సాయశక్తులా ప్రయత్నించాను. కానీ సెలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయాన్ని గౌరవించాలి. ఇప్పుడు నేను రంజీ ట్రోఫీ కోసం సిద్దమవుతున్నాను.'అని కరుణ్ నాయర్ చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్ పర్యటనలో తాము ఆశించిన రీతిలో రాణించకపోవడంతోనే కరుణ్ నాయర్‌పై వేటు వేసామని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చాడు. జట్టు ప్రకటన అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో కరుణ్ నాయర్ నుంచి మేం మరింత నిలకడైన ప్రదర్శనను ఆశించాం. మేం అందరికీ 15-20 టెస్ట్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఇవ్వలేం.'అని గవాస్కర్ సమాధానమిచ్చాడు. అక్టోబర్ 2 నుంచి అహ్మాదాబాద్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య తొలి టెస్ట్ ప్రారంభం కానుంది.వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన భారత జట్టు..శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా(వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్,కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్.

# భారత్‌ను రెచ్చగొట్టేందుకు ఆ సైగలు చేయలేదు

**• పాకిస్థాన్ పేసర్ హరీస్ రౌఫ్**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) ముందు పాకిస్థాన్ పేసర్ హరీస్ రౌఫ్ ఎలాంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాను ఎలాంటి తప్పిదం చేయలేదని గట్టిగా వాదించినట్లు తెలుస్తోంది. ఆసియా కప్ 2025 టోర్నీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో హరీస్ రౌఫ్ వివాదాస్పద సంజ్ఞలు చేసిన సంగతి తెలిసిందే. భారత్‌కు చెందిన జెట్ ఫ్లైట్స్‌ను కూల్చేశామని ప్రేక్షకులకు తెలియజేస్తూ .. 6-0 అనే సంజ్ఞలు చేశాడు.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత సాయుధ బలగాలు ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిభిరాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ దాడుల సమయంలో భారత్‌కు చెందిన 6 రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ అబద్ధపు ప్రకటన చేసింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటి వరకు ప్రపంచానికి చూపించలేదు. కానీ భారత్‌పై తామే యుద్ధం గెలిచామని సంబరాలు చేసుకుంది. భారత్‌తో మ్యాచ్‌లోనూ ఇదే విషయాన్ని తెలియజేస్తూ హరీస్ రౌఫ్ 6-0 సంజ్ఞలు చేశాడు. అంతేకాకుండా కవ్వింపులకు పాల్పడుతూ భారత్ ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు.అయితే హరీస్ రౌఫ్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా భారత అభిమానులు అతన్ని సోషల్ మీడియా వేదికగా ఏకీపారేసారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే అతన్ని ఐసీసీ వివరణ కోరగా.. తాను భారత్‌ను ఉద్దేశించి ఆ సంజ్ఞలు చేయలేదని వాదించినట్లు సమాచారం. హాఫ్ సెంచరీ అనంతరం గన్ ఎక్కుపెట్టి సంబరాలు చేసుకున్న పాకిస్థాన్ ఓపెనర్ సహిబ్‌జాద్ ఫర్హాన్ సైతం.. ఇదే




అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన సంబరాల వెనుక ఎలాంటి రాజకీయపరమైన చర్య లేదని, గతంలో ధోనీ, కోహ్లీ కూడా ఇలా సంబరాలు చేసుకున్నారని ఫర్హాన్ ఐసీసీకి వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరి మ్యాచ్ ఫీజులో ఐసీసీ కోత విధించే అవకాశం ఉంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన చేయనుంది. క్రికెట్ మ్యాచ్‌లో రాజకీయపరమైన విషయాలను ప్రస్తావించడం, సంజ్ఞలు చేయడం రూల్స్‌కు విరుద్ధం. ఇక పాక్‌పై విజయాన్ని భారత సాయుధ బలగాలకు అంకితం చేసిన సూర్యకుమార్ యాదవ్‌ను కూడా ఐసీసీ మందలించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవద్దని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.



# భారత్‌ను ఓడించడం పాకిస్థాన్‌కు చాలా కష్టం

**• పాకిస్థాన్ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్**

ఆసియా కప్ 2025 టోర్నీలో మరోసారి భారత్, పాకిస్థాన్ జట్లు తలపడున్నాయి. ఇరు జట్లు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాయి. ఆదివారం జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ టోర్నీలో ఇప్పటికే దాయాదీ దేశాలు రెండు సార్లు తలపడ్డాయి. అయితే ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ పాకిస్థాన్‌ను భారత్ చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచిన భారత్.. రెండో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముచ్చటగా మూడోసారి భారత్, పాక్‌లు ఫైనల్లో తలపడుతున్నాయి.ఆసియా కప్ చరిత్రలోనే భారత్, పాక్‌లు ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు ఫైనల్లో భారత్‌ను ఓడిస్తామని పాకిస్థాన్ ఆటగాళ్లు సవాల్ విసిరారు. దాంతో ఈ మ్యాచ్‌పై మరింత హైప్ క్రియేట్ అయ్యింది.హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన భారత్‌ను ఓడించడం పాకిస్థాన్‌కు చాలా కష్టమని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ అన్నాడు. అయితే టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మను త్వరగా ఔట్ చేస్తే భారత్‌ను ఓడించవచ్చని పాక్ ఆటగాళ్లకు సూచించాడు. 'భారత్‌తో మ్యాచ్ అనగానే ఒత్తిడికి గురయ్యే మైండ్‌సెట్ నుంచి పాకిస్థాన్ ఆటగాళ్లు బయటకు రావాలి. బంగ్లాదేశ్‌పై ఎలా ఆడారో అలాగే భారత్‌ను ఓడించాలి. మొత్తం 20 ఓవర్లూ బౌలింగ్ చేయకుండా.. 10 వికెట్లు తీసేందుకు ప్రయత్నించాలి.ముఖ్యంగా అభిషేక్ శర్మను తొలి మూడు ఓవర్లలోనే ఔట్ చేయాలి. అప్పుడే భారత్‌పై ఒత్తిడి పెట్టవచ్చు. భారత్‌కు ఇప్పటి వరకు వచ్చిన ఆరం భాలన్నీ అభిషేక్ శర్మ అందించినవే. అభిషేక్ శర్మను ఔట్ చేయకపోతే మాత్రం పాకిస్థాన్ గెలవడం కష్టం. అభిషేక్ తప్పిదం చేయడం కూడా చాలా తక్కువ. కాబట్టి అతనిపై అటాకింగ్ బౌలింగ్ చేయాలి. అప్పుడే మిగతా భారత్ బ్యాటర్లు ఆచితూచి ఆడేందుకు ప్రయత్నిస్తారు. పరుగుల కోసం కష్టపడుతారు. అయితే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అక్కడ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నాడు. పాక్‌పై టాప్ క్లాస్ ఆటను ఆడాలని భారత్‌కు చెబుతాడు. చెత్త జట్టుతో దిగినా.. నాసికరంగా ఆడినా.. పాక్ ఫైనల్ చేరుకుంది. తుదిపోరులో మాత్రం దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తారని భావిస్తున్నా.'అని షోయబ్ అక్తర్ చెప్పుకొచ్చాడు.

# లంకతో రసవత్తర పోరు..

## సూపర్ ఓవర్ లో భారత్ విజయం

ఆసియా కప్‌లో భాగంగా శనివారం శ్రీలంకతో జరిగిన సూపర్4 మ్యాచ్ టీమిండియా సూపర్ ఓవర్ లో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ %ూాఎజవతీఱంవఎవత్% దుబాయి: ఆసియా కప్‌లో భాగంగా శనివారం శ్రీలంకతో జరిగిన సూపర్4 మ్యాచ్ టీమిండియా సూపర్ ఓవర్ లో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగుల భారీ స్కోరును సాధించింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక అదే రేంజ్ లో జవాబునిచ్చింది. ఓపెనర్ పాథుమ్ నిసాంకా (107) శతకంతో చెలరేగగా.. కుశాల్ పెరీరా (58) అర్ధ సెంచరీతో రాణించడంతో లంక కూడా 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 202 పరుగులు చేసింది. దీంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. ఈ సూపర్ ఓవర్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన లంక పరుగులు మాత్రమే చేసి రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం 3 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన తొలి బంతికే మూడు పరుగులు చేసి గెలుపొందింది. దీంతో నిసాంకా సెంచరీ వృథా అయ్యింది. ఇక, ఆదివారం ఫైనల్ పోరులో దాయాది పాకిస్థాన్ జట్టుతో టీమిండియా తలపడనుంది. అభిషేక్ జోరు.. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఆశించిన శుభారంభం లభించలేదు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ తన పేలవమైన ఫామ్‌ను ఈ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తూ (4) పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు.





అయితే మరో ఎండ్‌లో యువ సంచలనం అభిషేక్ శర్మ తన భీకర ఫామ్‌ను ఈసారి కూడా కొనసాగించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సహకారంతో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అభిషేక్ స్కోరును పరిగెత్తించాడు. అతన్ని కట్టడి చేసేందుకు వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశాడు. మరోవైపు సూర్యకుమార్ ఒక ఫోర్‌తో 12 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. కొద్ది సేపటికే అభిషేక్ శర్మ కూడా ఔటయ్యాడు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్ 21 బంతుల్లోనే 8 ఫోర్లు, రెండు భారీ సిక్సర్లతో 61 పరుగులు సాధించాడు. ఆ తర్వాత స్కోరును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను తిలక్ వర్మ, సంజు శాంసన్‌లు తమపై వేసుకున్నారు. ఇద్దరు లంక బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ స్కోరును పరిగెత్తించారు. వీరిని ఔట్ చేసేందుకు లంక బౌలర్లు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. ధాటిగా ఆడిన సంజు శాంసన్ 23 బంతుల్లోనే 3 సిక్సర్లు, ఓ ఫోర్‌తో 39 పరుగులు చేశాడు. సమన్వయంతో ఆడిన తిలక్ వర్మ 34 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 49 పరుగులు సాధించాడు. అక్షర్ పటేల్ 15 బంతుల్లో ఓ ఫోర్, మరో సిక్స్‌తో 21 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో భారత్ స్కోరు 202 పరుగులకు చేరింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రౌడీ హీరో రెండు పడవల ప్రయాణం



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండకు ఈ మధ్య ఏం చేసినా పెద్దగా కలిసిరావడం లేదు. ఏ సినిమాకు ఆ సినిమా కోసం విజయ్ కష్టపడుతూనే ఉన్నప్పటికీ అతనికి సక్సెస్ మాత్రం దరి చేరడం లేదు. ఫ్యామిలీ స్టార్ సినిమా తర్వాత ఎన్నో అంచనాలు పెట్టుకుని చేసిన కింగ్‌డమ్ సినిమా కూడా అతనికి తీవ్ర నిరాశనే మిగిల్చింది. కింగ్‌డమ్ మూవీతో విజయ్ సాలిడ్ హిట్ అందుకుని కంబ్యాక్ ఇస్తాడని అంతా అనుకున్నారు.కానీ కింగ్‌డమ్ సినిమా కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో విజయ్ ఆశలన్నింటినీ తన తర్వాతి సినిమాపైనే పెట్టుకున్నారు. కింగ్‌డమ్ తర్వాత విజయ్, రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. విజయ్ హీరోగా నటించిన ట్యాక్సీవాలా మూవీతో డైరెక్టర్ గా పరిచయమైన రాహుల్, ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్ తో మరో హిట్ ను అందుకున్నారు.ఇప్పుడు రాహుల్ మూడో సినిమాను విజయ్ దేవరకండ హీరోగానే చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లి ఓ షెడ్యూల్ ను పూర్తి చేసుకోగా, ఇప్పుడు ఈ మూవీ రెండో షెడ్యూల్ కు రెడీ అవుతుంది. విజయ్ కెరీర్లో 14వ సినిమాగా తెరకెక్కనున్న ఈ మూవీ సెకండ్ షెడ్యూల్ ఈ నెలాఖరు నుంచి లేదా అక్టోబర్ మొదటి వారం నుంచి హైదరాబాద్ లో వేసిన స్పెషల్ సెట్ లో మొదలవనున్నట్టు సమాచారం.వీడీ14లో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుండగా, ఈ మూవీ 1854-78 మధ్య కాలంలో జరిగే కథగా తెలుస్తోంది. వీడీ14 తో పాటూ విజయ్ మరో సినిమాను కూడా లైన్ లో పెట్టిన సంగతి తెలిసిందే. రాజా వారు రాణి గారు, అశోక వనంలో అర్జున కళ్యాణం ఫేమ్ రవి కిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ ఓ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా ఆ సినిమా అక్టోబర్ 2న లాంచ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అక్టోబర్ లేదా నవంబర్ నుంచి ఆ సినిమా షూటింగ్ కూడా మొదలవనుందట. అంటే విజయ్ ఈ రెండు సినిమాలనీ సమాంతరంగా పూర్తి చేయాలని ప్లాన్ చేసినట్టున్నారు. మరి ఈ రెండు సినిమాలైనా విజయ్ కు మంచి సక్సెస్ ను అందించి, అతని కెరీర్ ను మలుపు తిప్పుతాయేమో చూడాలి.





# సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరికి మాతృవియోగం

ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు వైవీఎస్ చౌదరి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన తల్లి యలమంచిలి రత్నకుమారి (88) తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, చికిత్స పొందుతూ కన్నుమూశారు. తల్లి మరణంతో వైవీఎస్ చౌదరి తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆయనకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

ఈ సందర్భంగా తన తల్లితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వైవీఎస్ చౌదరి సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ చేశారు. “పొట్ట కోస్తే అక్షరం ముక్క రాదు అనే సామెతకు మా అమ్మ నిలువెత్తు నిదర్శనం. కానీ, లారీ డ్రైవర్ అయిన మా నాన్నగారి నెల జీతంతోనే తన ముగ్గురు పిల్లలకు పౌష్టికాహారం, చదువులు, వైద్యం, పండుగలు, వేడుకలు వంటి అన్ని అవసరాలను తీర్చిన గొప్ప ఆర్థిక నిపుణురాలు మా అమ్మ” అని ఆయన పేర్కొన్నారు.

“తెల్లవారుజామునే లేచి, పనిమనిషి సహాయం లేకుండా అన్నీ తానై మమ్మల్ని పెంచడానికి తన జీవితాన్నే అంకితం చేసిన ఆదర్శమూర్తి ఆమె. మా అమ్మకు తెలిసిన లెక్కలు, మమ్మల్ని పెంచిన విధానం ఏ చదువూ నేర్పించలేనిది. అలాంటి గొప్ప వ్యక్తి, ఈ భువి నుంచి సెలవు తీసుకుని స్వర్గంలో ఉన్న మా నాన్నగారిని, అన్నగారిని కలుసుకోవడానికి వెళ్లిపోయారు” అంటూ వైవీఎస్ చౌదరి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆయన పోస్ట్ చూసిన అభిమానులు, శ్రేయోభిలాషులు రత్నకుమారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ కామెంట్లు చేస్తున్నారు.

# సంచలన ప్రాంచైజీలో నేషనల్ క్రష్!



నేషనల్ క్రష్ రష్మికా మందన్నా బాలీవుడ్ లో ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. స్టార్ హీరోలే అమ్మడి కోసం వెయిట్ చేస్తున్నారాంటే? నార్త్ లో అమ్మడి డిమాండ్ ఎలా ఉందో అద్దం పడుతుంది. రష్మిక కూడా ఎక్కడా కంగారు పడకుండా ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇవాళ్లి నిర్ణయాలే రేపటి భవిష్యత్ గా భావించి సరైన కథలు అయితేనే కమిట్ అవుతుంది. లేదంటే నిర్మొహమాటంగా నో చెబుతుంది. తాను పారితోషికం కోసం పనిచేసే నటిని కాదని నిర్మాతలకు తెలివిగా సంకేతాలు పంపిస్తుంది. తాను ఏ సినిమా కమిట్ అయినా అందులో తప్పని సరిగా స్టార్లు కూడా యాడ్ అయ్యేలా చూసుకుంటుంది. బాలీవుడ్ స్పెషల్ మూవీ: ప్రస్తుతం %-%తామ్మా%-, -%కాక్ టెయిల్ 2 షూటింగ్ లతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా సంచలన ప్రాంచైజీ %-%దోస్తానా %-% లో హీరోయిన్ గా అమ్మడికి అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. విక్రాంత్ మాస్సే కథానాయకుడిగా కరణ్ జోహార్ ప్రతిష్టాత్మకంగా దోస్తానా 2 ని తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ లో ఇది ఎంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్ గా హైలైట్ అవుతుంది. తొలుత ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్ ని హీరోగా తీసుకుని అటుపై అతడిని తప్పించి విక్రాంత్ కు అవకాశం ఇచ్చారు. కార్తీక్ ని అనూహ్యంగా కరణ్ తప్పించడం అప్పట్లో పెద్ద సంచలనంగానే మారింది. నిర్మాతను గడువు కోరిన నటి: దీంతో మరోసారి నెపోటిజం అంశం చర్చకొచ్చింది. అలాంటి పరిస్థితుల్లో విక్రాంత్ ఈ ప్రాజెక్ట్ కు హీరోగా ఎంపికయ్యాడు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇందులో హీరోయిన్ కోసం రకరకాల పేర్లు పరిశీలించారు కరణ్ అండ్ కో. కానీ ఎవ్వర్నీ ఇంత వరకూ ఫైనల్ చేయలేదు. తాజాగా రష్మిక మందన్నానను కరణ్ అప్రోచ్ అయి విషయం చెప్పినట్లు..అందుకు రష్మిక కూడా సానుకూలంగా స్పందించినట్లు ఆమె సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. తుది నిర్ణయం చెప్పడానికి మాత్రం కొంత గడువు కావాలని కోరిందిట. అందుకు కరణ్ కూడా ఒకే చెప్పినట్లు సమాచారం.

# బాక్సాఫీస్‌కు పూనకాలు

## : 'ఓజీ'తో పవన్ ఆల్ టైమ్ రికార్డ్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన తాజా చిత్రం 'ఓజీ' బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. భారీ అంచనాల మధ్య నిన్న విడుదలైన ఈ సినిమా, తొలిరోజే రికార్డు స్థాయి కలెక్షన్లతో సంచలనం రేపింది. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు విడుదలైన చిత్రాల్లో ఇదే అతిపెద్ద ఓపెనర్‌గా నిలిచి, పవన్ స్టార్‌డమ్‌ను మరోసారి రుజువు చేసింది.ట్రేడ్ ట్రాకర్ సాక్నిల్క్ సమాచారం ప్రకారం, 'ఓజీ' చిత్రం విడుదలైన మొదటి రోజే దేశీయంగా రూ. 70 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. అంతకుముందు రోజు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 20.25 కోట్లు వచ్చాయి. దీంతో ఈ సినిమా మొత్తం వసూళ్లు ఇప్పటికే రూ. 90.25 కోట్లకు చేరాయి. ప్రపంచవ్యాప్తంగా తొలిరోజు కలెక్షన్లు రూ. 150 కోట్ల మార్కును దాటవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభంజనంతో పవన్ కల్యాణ్ తన గత చిత్రం 'హరి హర వీరమల్లు' (తొలిరోజు రూ. 34 కోట్లు) రికార్డును సునాయాసంగా అధిగమించారు.ఈ ఏడాది విడుదలైన ఇతర పెద్ద చిత్రాల రికార్డులను కూడా 'ఓజీ' బద్దలు కొట్టింది. రజనీకాంత్ 'కూలీ' (రూ. 65 కోట్లు), విక్కీ కౌశల్ 'ఛావా' (రూ. 31 కోట్లు), 'సైయారా' (రూ. 21.5 కోట్లు) చిత్రాల తొలిరోజు వసూళ్లను 'ఓజీ' అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది.సుజీత్ దర్శకత్వంలో డి.వి.వి. దానయ్య నిర్మించిన ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ ఒక గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ఈ చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేయగా, ప్రియాంక మోహన్, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషించారు.


# 'ది రాజా సాబ్' ట్రైలర్ డేట్ వచ్చేసింది!



రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' చిత్రం నుంచి ఓ కీలకమైన అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ట్రైలర్‌ను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సిద్ధమయ్యారు. అక్టోబర్ 2న రాబోతున్న ఈ ట్రైలర్‌ను, అదే రోజు విడుదలవుతున్న 'కాంతారా చాప్టర్ 1' సినిమాతో పాటు థియేటర్లలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇప్పటికే ఈ ట్రైలర్ సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయినట్లు సమాచారం. టీజర్‌లో రొమాంటిక్, కామెడీ అంశాలను చూపించిన దర్శకుడు మారుతి, ఈసారి అందుకు భిన్నంగా హారర్, యాక్షన్ సన్నివేశాలతో ట్రైలర్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి.ఈ సినిమా విడుదల తేదీపై కొంతకాలంగా ఉన్న సందిగ్ధతకు ట్రైలర్‌తో తెరపడే అవకాశం కనిపిస్తోంది. మొదట డిసెంబర్ 5న విడుదల చేయాలని భావించినా, తాజా సమాచారం ప్రకారం సినిమాను 2025 జనవరి 9కి వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటనను ట్రైలర్‌లోనే చిత్రబృందం వెల్లడించవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మారుతి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

# సోల్ ఆఫ్ జటాధర



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించే ఈ పాన్ -ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. అద్భుతమైన విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో తెరకెక్కుతున్న జటాధర నవంబర్ 7న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. మేకర్స్ తాజాగా ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధార'ను విడుదల చేశారు. సాంప్రదాయ సంగీతం, ఆధ్యాత్మిక టచ్

నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించే ఈ పాన్ -ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. అద్భుతమైన విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో తెరకెక్కుతున్న జటాధర నవంబర్ 7న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. మేకర్స్ తాజాగా ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధార'ను విడుదల చేశారు

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701643